నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, గురువారం 19 సెప్టెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

వరదలను ఎదుర్కొనేందుకు 'సాప్'

- శాశ్వత పద్ధతిన 1077 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు దిశగా చర్యలు
- లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసేందుకు సైరన్
- కరుణగిరి ఏరియా పర్యటనలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఆశ్రమ నిర్వాహకులతో మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 18 : భవిష్యత్‌లో వచ్చే అకాల వరదలను పకడ్బందీగా ఎదుర్కొనేందుకు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్(సాప్)ను కట్టుదిట్టంగా అమలు చేయాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. మండలంలోని మున్నేరు ప్రభావిత ప్రాంతమైన కరుణగిరిలో బుధవారం పర్యటించిన కలెక్టర్.. సెయింట్ జోసెఫ్ మేజర్ చర్చి హాల్‌లో క్రిస్టియన్ సంబంధిత యాజమాన్యం, అధికారులతో ఇటీవల వచ్చిన వరదలు, కలిగిన నష్టం, భవిష్యత్‌లో చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. కరుణామయ అనాథాశ్రమం, అంధులు, మూగ పిల్లల జ్యోతి నివాస్ స్కూల్ వరకు వచ్చిన వరదలు, కలిగిన నష్టంపై ఆరా తీశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గంటల వ్యవధిలో కుంభవృష్టితో వర్షం కురవడంతో పరీవాహక ప్రాంతాల్లోని చెరువులు, ప్రాజెక్టులు అప్పటికే నిండుకుండలుగా మారాయని, ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరద రావడంతో మున్నేటిలో 40 అడుగుల మేర నీటి ప్రవాహం పెరిగిందన్నారు. నగరంలో వచ్చిన భారీ వరదలతో అందుబాటులో ఉన్న అధికారుల బృందాలు, సిబ్బందితో ప్రజల ప్రాణాలు రక్షించేందుకు అప్పటికప్పుడు చర్యలు చేపట్టారన్నారు. వరద వచ్చే సమయంలో ప్రజలను ముందస్తుగా అప్రమత్తం చేసేందుకు కరుణగిరిలో సైరన్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించాలన్నారు. విపత్కర సమయంలో వినియోగించుకునేందుకు శాశ్వతంగా 1077 టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో శిక్షణ సహాయ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, తహసీల్దార్ రాంప్రసాద్, చర్చి రెకార్డు జయరాజు, సుధాకర్, సురేశ్, విజయ్, చార్లెస్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపండి..

- భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్
- సీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

డీసీహెచ్ఎస్ రవిబాబుతో చర్చిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేశ్

సారపాక, సెప్టెంబర్ 18 : ఆసుపత్రి నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రి ఆవరణలో ఐటీసీ సహకారంతో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్స్‌ను పరిశీలించి.. సరైన ప్రణాళిక లేకుండా నిర్మించారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పల్లెల్లో వెస్టన్ టాయిలెట్స్ ఏమిటని అసహనం వ్యక్తం చేసిన కలెక్టర్.. ఐటీసీ నుంచి లెటర్ పెట్టించాలని వైద్యాధికారికి సూచించారు. అనంతరం ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, ఆర్వో, ఆక్సిజన్ ప్లాంట్లను పరిశీలించారు. రోగుల వద్దకు వెళ్లి అందుతున్న సేవలపై ఆరా తీశారు. రోగులకు తయారు చేస్తున్న వంటలను పరిశీలించి నాణ్యతతో తయారు చేయాలని సూచించారు. అనంతరం గురుకుల పాఠశాలలో నెలకొన్న సమస్యలు, పాఠశాల పీడీ బదిలీ తదితర సమస్యలపై న్యాయవాది భజన సతీశ్, ప్రసాద్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ రవిబాబు, తహసీల్దార్ ముజాహిద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ముక్కంటేశ్వరరావు, వైద్యులు అనిత, సబితా రెడ్డి, మౌనిక, ఆసుపత్రి సిబ్బంది భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా రూపకల్పనకు సహకరించాలి

ఖమ్మం అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

మామిళ్లగూడెం, సెప్టెంబర్ 18 : ఓటర్ల జాబితా రూపకల్పనకు రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులకు సహకారం అందించాలని అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) డాక్టర్ పి.శ్రీజ అన్నారు. ఖమ్మం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో గ్రామీణ ఓటర్ల జాబితా రూపకల్పనపై వివిధ పార్టీల ప్రతినిధులతో అదనపు కలెక్టర్ బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా రూపకల్పనకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని, దీని ప్రకారంగా ఈ నెల 13న వార్డులవారీగా ఓటరు జాబితా సిద్ధం చేసి పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శించామన్నారు. ఇందులో అభ్యంతరాలు, కొత్త ఓటర్ల నమోదు దరఖాస్తులను ఈ నెల 21 లోపు సంబంధిత ఎంపీడీవోలకు లిఖితపూర్వకంగా సమర్పించాలని, 26 లోపు అభ్యంతరాలను పరిష్కరించి 28న తుది జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ఒక కుటుంబంలో ఉన్న సభ్యులందరికి ఒకే వార్డులో ఓట్లు ఉండేలా కార్యాచరణ రూపొందించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో దీక్షా రైనా, డీపీవో ఆశాలత, డీఎల్‌పీవో రాంబాబు, బీఎస్పీ నుంచి బుర్రా ఉపేందర్, సీపీఎం నుంచి ఎన్.వీరబాబు, నవీన్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి గోపాల్‌రావు, టీడీపీ నుంచి కృష్ణాప్రసాద్, సీపీఐ నుంచి తాటి వెంకటేశ్వర్లు, సీపీఐ(ఎంఎల్) నుంచి ఆవుల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

చాక్‌పీస్‌లు లేవు.. చార్టులు లేవు

చాక్‌పీసులు, చార్టులకు నిధులు కేటాయించలేని దుస్థితిలో సర్కారు పాఠశాలలు నడుస్తున్నాయి. బడులు మొదలై నాలుగు నెలలు గడుస్తున్నా ప్రభుత్వం నిధులు విడుదల చేసిన పాపాన పోలేదు. పాఠశాల ఉపాధ్యాయులే తమ సొంత డబ్బులతో చాక్‌పీసులు, చార్టులు, పరీక్షల నిర్వహణకు పేపర్లు, రిజిస్టర్లు, డస్టర్లు సమకూర్చుకుంటున్నారు. ఇక టాయిలెట్లను శుభ్రం చేయించాలన్నా పనివాళ్లకు పైసా చెల్లించలేని స్థితికి స్కూల్స్ చేరుకున్నాయి. దీంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వం వీటన్నింటికి చరమగీతం పాడగా, తాజాగా కాంగ్రెస్ పాలనలో మళ్లీ ఆ సమస్యలు వెక్కిరిస్తున్నాయి. 2024-25 విద్యాసంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలలకు వార్షిక నిర్వహణ నిధులు ఇప్పటికీ ప్రధానోపాధ్యాయుల ఖాతాల్లో జమ కాకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు అద్దం పడుతున్నది.

- గ్రాంట్ రాక భారంగా సర్కారు బడుల నిర్వహణ
- సొంత నగదుతో సమకూర్చుకుంటున్న టీచర్లు
- ఇప్పటికే మూడు జెండా పండుగలు పూర్తి
- విద్యాసంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలైనా నిధులు నిల్

ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి/ భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ, సెప్టెంబర్ 18: కేవలం ప్రచార ఆర్భాటాల కోసం రూ.కోట్లు కుమ్మరిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మాత్రం నిధులు విడుదల చేయడం లేదు. బలవంతంగా ఉపాధ్యాయులతో కార్యక్రమాలను నిర్వహించమని ఒత్తిడి తెస్తూ కంటితుడుపుగా విద్యాసంవత్సరానికి సంబంధించిన వార్షిక నిర్వహణ నిధులను విడుదల చేస్తున్నట్లు జీవో ఇచ్చినా నగదు మాత్రం బ్యాంక్ ఖాతాల్లో పడలేదు. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి నాలుగు నెలలు గడుస్తున్నా రూపాయి కూడా జమ కాలేదు. ప్రతి సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం జూన్‌లో 50 శాతం కాంపోజిట్ స్కూల్ గ్రాంట్ విడుదల చేస్తున్నది. 2023-24 విద్యాసంవత్సరంలో మొదటివిడతగా రూ.34.95 కోట్లను జూన్‌లోనే విడుదల చేసింది. గత సంవత్సరం, ఈ విద్యాసంవత్సరంలో విడుదలైన నిధుల కేటాయింపుల గురించి ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు.

జిల్లాలో 1,299 పాఠశాలలు..

ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, కేజీబీవీ, మోడల్ స్కూల్స్, సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖలకు చెందిన 1,299 పాఠశాలల్లో 1,05,724 మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రభుత్వ విద్యారంగాభివృద్ధికి ఎలాంటి తోడ్పాటును అందించకపోవడంతో ప్రస్తుత విద్యాసంవత్సరంలో జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ తగ్గింది. విద్యార్థులకు అందించే సీఎం బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని తొలగించడం, అవసరమైన సదుపాయాలను కల్పించే విషయంలో సమగ్రశిక్ష అభియాన్ నిధులు కేటాయించకపోవడంతో సర్కార్ బడులు సమస్యలతో సహవాసం చేయాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయి.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో..

పాఠశాలలు	విద్యార్థులు
ప్రాథమిక 794	23,042
యూపీఎస్‌లు 160	2,168
హైస్కూళ్లు 111	19,435
మొత్తం 1,065	44,645

విద్యార్థుల సంఖ్య ఆధారంగా స్కూల్ గ్రాంట్

1 నుంచి 30 మంది లోపు ఉంటే.. రూ.10 వేలు
30 నుంచి 100 లోపు ఉంటే.. రూ.25 వేలు
100 నుంచి 250 లోపు ఉంటే.. రూ.50 వేలు
250 నుంచి 1000 లోపు ఉంటే.. రూ.75 వేలు
1000 మందికిపైగా ఉంటే.. రూ.లక్ష

సొంత ఖర్చులతో నిర్వహణ..

ప్రభుత్వం విడుదల చేసిన వార్షిక నిధులతో పాఠశాలలో వసతులు కల్పించాలి. ఇంటర్నెట్, కంప్యూటర్ల సర్వీసింగ్, విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు వీలుగా గ్రంథాలయాల్లో విజ్ఞాన పుస్తకాలు, దినపత్రికలు, మాసపత్రికల కొనుగోలుకు వెచ్చించాల్సి ఉంటుంది. అదేవిధంగా స్టేషనరీ, టీఎల్ఎం(టీచర్ లెర్నింగ్ మెటీరియల్), క్రీడా సామగ్రి, పరీక్షల నిర్వహణకు పేపర్ల కొనుగోలుకు నిధులను వినియోగించుకోవాలి. నిధులు విడుదల కాకపోవడంతో ప్రధానోపాధ్యాయులతోపాటు ఉపాధ్యాయులు తలా కొంచెం సర్దుబాటు చేసుకుంటూ సొంత నిధులతో స్కూల్ నిర్వహణ సాగిస్తున్నారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన తర్వాత వాటిని ఉపాధ్యాయులు వాటిని తిరిగి తీసుకుంటున్న పరిస్థితి ఉంది. ప్రభుత్వం మంజూరు చేసిన నిధుల్లో ప్రతి పైసాను పాఠశాల యాజమాన్య అభివృద్ధి కమిటీ ద్వారా తీర్మానం చేసి పారదర్శకంగా ఖర్చు చేయాల్సి ఉంది. ప్రభుత్వం విడుదల చేసిన నిధుల వివరాలను ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది.



ఇప్పటికే మూడు జెండా పండుగలు పూర్తి..

ఈ విద్యా సంవత్సరం ఇప్పటికే మూడు జెండాపండుగలు నిర్వహించారు. జూన్ 2 ఆవిర్భావ దినోత్సవం, ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం, సెప్టెంబర్ 17 ప్రజాపాలన దినోత్సవాల పేరిట పాఠశాలల్లో జెండా ఎగురవేశారు. వీటి నిర్వహణ భారంగా మారింది. నిధుల జాప్యం పాఠశాల నిర్వహణకు ఆటంకంగా తయారైంది. ఒక్క కాంపోజిట్ స్కూల్ గ్రాంట్ మాత్రమే కాకుండా స్పోర్ట్స్ గ్రాంట్, స్టిచ్చింగ్, ఎంఆర్‌సీ గ్రాంట్, కాంప్లెక్స్ గ్రాంట్, ట్రాన్స్‌పోర్ట్ చార్జెస్, డైట్ చార్జెస్, సెల్ఫ్ డిఫెన్స్ గ్రాంట్ సకాలంలో ఇవ్వాల్సి ఉంది.

కాంపోజిట్ గ్రాంటు రాలేదు..

ప్రతి ఏడాది రెండుసార్లు కాంపోజిట్ స్కూల్ గ్రాంటు ప్రభుత్వం మంజూరు చేయాల్సి ఉంది. జూన్‌లో విద్యాసంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడిచినా ఇంతవరకు మా పాఠశాలకు కాంపోజిట్ స్కూల్ గ్రాంటు రాలేదు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 50 శాతం నిధులు అంటే.. రూ.25 వేలు రావాల్సి ఉంది. స్కూల్ గ్రాంటు రాకపోవడంతో పాఠశాల అభివృద్ధికి అవసరమైన చాక్‌పీస్, డస్టర్, తెల్లకాగితాలు, పాఠశాలకు అవసరమైన నిత్యావసరాలు సొంతంగా ఖర్చు చేయాల్సి వస్తున్నది. విద్యాశాఖ స్కూల్ గ్రాంట్‌ను మంజూరు చేసిందని చెబుతున్నా తమ ఖాతాలో ఇంత వరకు జమ కాలేదు.

– జగపతి, హెచ్ఎం, నాచారం జడ్పీ ఉన్నత పాఠశాల

నిధులు జమ కాలేదు..

దమ్మపేట మండలానికి కాంపోజిట్ స్కూల్ గ్రాంట్ ఇంతవరకు రాలేదు. మండలంలో 8 జడ్పీ ఉన్నత, 58 ప్రైమరీ, 25 యూపీఎస్ పాఠశాలలు ఉన్నాయి. నిధులు సకాలంలో రాకపోవడంతో పాఠశాలలకు అవసరమైన నిత్యావసరాలకు హెచ్ఎంలే సొంత డబ్బులు ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వం విడుదల చేసిందని చెబుతున్న గ్రాంటు హెచ్ఎంల ఖాతాల్లో ఇంకా జమ కాలేదు.

– కేసరి లక్ష్మి, ఎంఈవో, దమ్మపేట

సొంత నిధులతో సమకూర్చాం..

పాఠశాల నిర్వహణలో నిధులు లేక బోధనలో ఆటంకాలు ఏర్పడకుండా సొంత నిధులతో చాక్‌పీసులు, చార్ట్‌లు, ఇతర సామగ్రిని సమకూర్చుకున్నాం. పాఠశాల నిర్వహణలో కీలకమైన స్కూల్ గ్రాంట్ విడుదలలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలి.

– గుడిపూడి శ్రీనివాసరావు, హెచ్ఎం, యూపీఎస్ వేణుగోపాలనగర్

జూన్‌లోనే గ్రాంటు ఇవ్వాలి..

పాఠశాలలు అంటేనే సర్కారుకు చిన్నచూపు. అసలు నిధులు ఇవ్వరు. ఇచ్చినా సమయానికి రావు. దీనివల్ల టీచర్లే చేతి నుంచి డబ్బులు పెట్టుకుంటున్నారు. చాక్‌పీసులు అయితే కొంటారు. ఆట వస్తువులు ఎలా కొనాలి. పాతవి, ఉన్నవాటితో ఆడిస్తున్నాం. ఒక్కోసారి విద్యాసంవత్సరం అయిపోయాక గ్రాంటు వస్తుంది. అది ఎవరికీ ఉపయోగపడదు.

– ఎన్.కృష్ణ, అశ్వాపురం స్కూల్ టీచర్, యూటీఎఫ్ జనరల్ సెక్రటరీ

నిధులు త్వరగా విడుదల చేయాలి..

పాఠశాలలో ఇంగ్లిష్‌తోపాటు ఉర్దూ మీడియం కూడా ఉంది. విద్యార్థులు 386 మంది వరకు వివిధ తరగతుల్లో చదువుతున్నారు. రోజువారీ నిర్వహణకు నిధులు సమస్యగా మారింది. పాఠశాలలోని టీచర్ల సహకారంతో అందరం కలిసి అన్ని వసతులు సమకూర్చుకుంటున్నాం. వీలైనంత త్వరగా నిధులు విడుదల చేస్తే ఉపశమనం ఉంటుంది.

– శాంత, హెచ్ఎం, రిక్కాబజార్ పాఠశాల

సమస్యల మధ్యే బోధన చేస్తున్నాం..

పాఠశాల నిర్వహణ ఆర్థికంగా భారంగా మారింది. పాఠశాలను అద్దె గదిలో నడుపుతున్నాం. దీనికి నెలకు రూ.1,500 అద్దె కూడా సొంత నగదును చెల్లిస్తున్నాం. ఇవి కాకుండా అదనంగా నెలకు మరో రూ.1,500 వరకు ఖర్చు వస్తున్నది. ప్రభుత్వం నిర్వహణతోపాటు పాఠశాలకు శాశ్వత పరిష్కారం చూపాలి.

– రాంబాబు, హెచ్ఎం, రజక వీధి పీఎస్

బుధవారం ఒక్కరోజేనా..!

- ప్రతి బుధవారం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారులు
- మిగిలిన రోజుల్లో అధ్వానంగా మధ్యాహ్న భోజనం
- ప్రభుత్వ పాఠశాలల్లో అమలుకాని మెనూ
- 21 మండలాలకుగాను ఇప్పటి వరకు 10 మండలాల్లోనే పరిశీలన
- కలెక్టర్ ఆశయం ఘనం.. క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం
- ప్రతిరోజూ నాణ్యమైన భోజనం అందించాలంటున్న తల్లిదండ్రులు

ముదిగొండలో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 18 : విద్యార్థులకు చదువుతోపాటు ఆకలి కేకలు లేకుండా చేసేందుకు మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నారు. ఖమ్మం జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో ఒక్కరోజు మాత్రమే నాణ్యమైన, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అందిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మిగిలిన రోజుల్లో నీళ్ల చారు, ఉడికీ ఉడకని అన్నం, అమలుకాని మెనూ మధ్యాహ్న భోజనంలో దర్శనమిస్తున్నాయి. కలెక్టర్‌గా ముజమ్మిల్‌ఖాన్ బాధ్యతలు స్వీకరించిన అనంతరం వారంలో ఒకరోజు జిల్లా అధికారులు ప్రతి బుధవారం మండలంలోని ఒక పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేయాలని ఆదేశించారు. దీంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులు బుధవారం రోజు మాత్రం పక్కాగా మెనూతో పాటు రుచికరమైన భోజనాన్ని అందిస్తున్నారు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రుచికరమైన భోజనం బుధవారం ఒక్కరోజు అందిస్తే సరిపోతుందా.. అని ప్రశ్నిస్తున్నారు.

కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ..

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రభుత్వ విద్యాసంస్థలపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో ఎక్కడ అవకాశం ఉన్నా పాఠశాలలను సందర్శించడంతోపాటు విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు. విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనాన్ని తింటున్నారు. ఇవన్నీ సర్కార్ స్కూల్స్ పట్ల తనకున్న ప్రత్యేక శ్రద్ధను స్పష్టం చేస్తున్నాయి. సమావేశాలు నిర్వహించిన ప్రతిసారి విద్యార్థుల హాజరు నూరుశాతం ఉండేందుకు కృషి చేయడంతోపాటు ఉపాధ్యాయుల హాజరు కూడా నూరుశాతం ఉండాలని పదేపదే చెబుతుండడం కలెక్టర్ మార్కును చూపిస్తున్నది. రేపటి నవభారత నిర్మాతలను తయారుచేసేది స్కూల్స్ అని బలంగా విశ్వసిస్తున్నట్లు అన్ని విభాగాల కంటే మిన్నగా విద్యాశాఖపై దృష్టి పెడుతుండడం తేటతెల్లమవుతున్నది.

ఆశయం ఘనం.. ఆచరణలో మాత్రం...

జిల్లాస్థాయి అధికారులు ప్రతి మండలంలోని ఒక పాఠశాలను ప్రతి బుధవారం తప్పనిసరిగా సందర్శించి మధ్యాహ్న భోజనం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని 21 మండలాల్లో ఒక్కో అధికారి ఒక్కో పాఠశాలలో భోజనం చేసి దానిపై డీఈవో కార్యాలయానికి వారి అభిప్రాయాన్ని తెలపాలి. మధ్యాహ్న భోజన పథకం అమలును పర్యవేక్షించడంతోపాటు నాణ్యతను పెంచడానికి భోజనం వడ్డించే సమయానికి స్వయంగా వెళ్లి పాల్గొనాలని సూచించారు. వంట పాత్రలు, వంటగది, ఆహార పదార్థాలు పరిశీలించాలి.. మెనూ అమలు చేస్తున్నారా..? వారంలో మూడ్రోజులు గుడ్లు అందిస్తున్నారా అనే వివరాలు విద్యార్థులతో కూడా మాట్లాడి తెలుసుకోవాల్సి ఉంది. కలెక్టర్ ఆశయం ఘనంగా ఉండగా దానిని క్షేత్రస్థాయిలో అమలుపర్చాల్సిన అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆశయం నీరుగారిపోతున్నది.

ఆగస్టులో నాలుగు బుధవారాలను పరిశీలిస్తే..

- ఆగస్టు 7వ తేదీన 12 మంది అధికారులు మాత్రమే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.
- ఆగస్టు 14వ తేదీన కేవలం ఐదుగురు అధికారులు మాత్రమే పాల్గొన్నారు.
- ఆగస్టు 21వ తేదీ మాత్రం కలెక్టర్ జడ్పీహెచ్ఎస్ మీనవోలులో పాల్గొనడంతో జిల్లా వ్యాప్తంగా మరో 21 మంది అధికారులు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించడం గమనార్హం.
- ఆగస్టు 28వ తేదీన మళ్లీ యథావిధిగా కేవలం 12 మంది అధికారులు మాత్రమే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

నగర చుట్టుపక్కల మాత్రమే పరిశీలన..

అధికారులు మధ్యాహ్న భోజన పరిశీలన కార్యక్రమాన్ని ఎంతో పరిశీలించాం అన్నట్లుగా సాగుతుంది. 21 మండలాల్లో అధికారులు ఇప్పటివరకు ఎవరూ సందర్శించనివి చాలా ఉన్నాయి. ఖమ్మం చుట్టుపక్కల ఉన్న 30 లేదా 40 కిలోమీటర్ల లోపు ఉన్న ప్రాంతాలైన ఖమ్మం నగరం, రఘునాథపాలెం, ఖమ్మం రూరల్, చింతకాని, కొణిజర్ల, వైరా, కారేపల్లి, కామేపల్లి, కూసుమంచి మండలాల్లో మాత్రమే సందర్శిస్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. కొందరు అధికారులు మాత్రం మొదటి నుంచి క్రమం తప్పకుండా పరిశీలిస్తున్న వారు ఉన్నారు.

నాణ్యత పెంచేలా..

బుధవారంతోపాటు మిగిలిన రోజుల్లో కూడా నాణ్యత పెంచేలా భోజనం అందించాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. నగరంలో కొంతమేరకు బాగుంటున్నా, గ్రామీణ ప్రాంతాల్లో మెనూ చాలావరకు అమలు కావడం లేదనేని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలా చోట్ల నీళ్ల చారు, ఉడకని అన్నం అందుతున్నట్లు విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

సెప్టెంబర్ 18న పరిశీలించిన అధికారులు

అధికారి	స్కూల్
ఎంవీ మధుసూదన్ (హార్టికల్చర్)	జడ్పీహెచ్ఎస్ కామేపల్లి
కిరణ్‌కుమార్, (ఫుడ్ ఇన్‌స్పెక్టర్)	జడ్పీహెచ్ఎస్ రోటరీనగర్
దీక్షారైనా, (జడ్పీ సీఈవో)	జడ్పీఎస్ఎస్ కొదుమూరు
సత్యనారాయణ (ఎస్‌సీడీడీ)	జడ్పీఎస్ఎస్ తనికెళ్ల
లత (డీపీవో)	జడ్పీఎస్ఎస్ కూసుమంచి
నవీన్ (ఎస్సీ కార్పొరేషన్ ఈడీ)	జడ్పీఎస్ఎస్ చింతకాని
రవిబాబు (డీఐఈవో)	కేజీబీవీ సింగరేణి
విజయలక్ష్మి (డీడీటీడబ్ల్యూ)	జడ్పీహెచ్ఎస్ ముదిగొండ
సాయినాథ్ (ఏడీ మైన్స్)	టీజీఆర్ఎస్ ఏన్కూరు
హుస్సేన్ (డీడీ)	జడ్పీహెచ్ఎస్ నాయకన్‌గూడెం
సునీల్‌రెడ్డి (డీవైఎస్‌వో)	జీహెచ్ఎస్ వైరా

ఏసీబీకి చిక్కిన జిల్లా ఉద్యానవన అధికారి

భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ సముదాయంలో రైడ్

రూ.1.14 లక్షలు తీసుకుంటుండగా పట్టుకున్న ఏసీబీ డీఎస్పీ

భద్రాద్రి కలెక్టరేట్‌లో జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సూర్యనారాయణను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ) : పండ్ల తోటల పెంపకానికి డ్రిప్ పరికరాలను సరఫరా చేసే వ్యక్తి నుంచి రూ.1.14 లక్షలు లంచం తీసుకుంటుండగా జిల్లా ఉద్యానవన అధికారిని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాలో పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులకు సబ్సిడీపై డ్రిప్ పరికరాలను అందజేస్తోంది. అయితే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాతోపాటు మహబూబాబాద్ జిల్లాకు కూడా డ్రిప్ పరికరాలను సరఫరా చేసి.. రైతుల తోటల్లో బిగించిన వ్యక్తికి జిల్లా ఉద్యానవన శాఖ కార్యాలయం నుంచి బిల్లులు రావాల్సి ఉంది. దీనిని అదునుగా భావించిన జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి కె.సూర్యనారాయణ.. తనకు పర్సంటేజీ ఇస్తేనే బిల్లులు చేస్తానని సదరు వ్యక్తికి చెప్పాడు. దీంతో ఏసీబీ అధికారులను ఆశ్రయించిన బాధిత వ్యక్తి.. పరిస్థితిని వారికి వివరించాడు. ఏసీబీ అధికారులు చెప్పిన విధంగా బాధితుడు భద్రాద్రి కొత్తగూడెం కలెక్టరేట్ భవన సముదాయంలో ఉన్న జిల్లా ఉద్యానవన అధికారి సూర్యనారాయణకు రూ.1.14 లక్షల లంచం ఇచ్చాడు. సాయంత్రం 6:45 గంటలకు అక్కడ మాటువేసి ఉన్న ఏసీబీ డీఎస్పీ రమేశ్ తన బృందంతో సూర్యనారాయణ వద్ద ఉన్న లంచం డబ్బులను గుర్తించి పట్టుకొని అదుపులోకి తీసుకున్నారు. దాడుల్లో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు శేఖర్, రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.